# 'నిజరూపాలు'

**ఆదెయ్యకు** అసలే ఆకలేస్తోంది. దానికి తోడు ఎన్నడూ లేని ఆలోచనలు అతడిని పట్టుకొన్నాయి. దాంతో మరింత నీరసం.

మేట్నీ ఆటను వదిలే సమయం అవుతోంది. కాంపౌండ్‌నంతా శుభ్రంగా చిమ్మి నీళ్ళు చల్లి ఫస్ట్ షో సినిమాకు హాలును నీట్‌గా తయారు చేస్తున్నాడు.

"ఒరేయ్ ఆదీ. ఎవరో గెస్టులొస్తారంట. మేనేజర్ గదిని మరోసారి శుభ్రంగా చిమ్మేయి."

పని-పని మీద పని-

ఆలోచన-ఆలోచనపైన ఆలోచన-

"ఆదిగా. ఈ టీ తాగరా" గదిని చిమ్మేక మేనేజరు టేబిల్ మీద వున్న ఓ కప్పును చూపిస్తూ అన్నాడు.

చల్లటి టీని తాగేడు. గుక్కెడు నీళ్ళు కడుపు నింపుతాయా?

ఆదెయ్యకు అప్పుడు కడుపునిండా పెళ్ళి భోజనం చేయాలని వుంది. అతను మంచి తిండి పుష్టి వున్న మనిషి. దానికి తోడు అతడికి తిండికెక్కడా లోటుండదెన్నడూ. మొదటి నుంచి రకరకాల ఆధరువులతో భోజనం చేసే అలవాటతనికి.

ఆదెయ్య, సినిమాహాళ్ళో ఇటీవల కాలంలో వుద్యోగం దొరికేవరకు, పాచిపనులు చేసే వాడు. అంట్లు తోమేవాడు. అతడు, అతడి భార్య జాలమ్మ కలిస్తే బండెడు పెళ్ళి అంట్లను సునాయాసంగా తోమిపారేయగలరు. సినిమాహాల్లో చేరేక ఆదెయ్యకు హాల్లో పాచిపనులకే ఎక్కడి కాలమూ చాలదు. యిక అంట్లెక్కడ తోమగలడు?

జాలమ్మ కూడా పాచిపని చేసేది వొకే వొక్క ధనవంతుల యింట్లో మాత్రమే. ఆ యింటి వాళ్ళు తినేసే దానికన్నా పారేసేదే ఎక్కువ. వాళ్ళు అలా పారవేసినదంతా జాలమ్మ మూట కట్టుకొచ్చి ఆదెయ్యకు, పిల్లలకి పెడ్తుంది. ఆ యింటి వాళ్ల నెల రోజులుగా ఎక్కడికో వెళ్లేరు. దాంతో ఆదెయ్యకు తిండి పెద్ద సమస్య అయింది.

"మీ సుబ్బడిని గురించి ఏమాలోచించావురా ఆదిగా?" మేనేజర్ అడిగాడు.

సుబ్బడు ఆదెయ్య వొకేవొక్క కొడుకు. అయిదుగురు ఆడబిడ్డల మధ్య పుట్టినవాడు. చిన్నతనంలో తలిదండ్రులతో పాటు అంట్లకు వెళ్ళే సుబ్బడిని వో టీచరు, స్కూల్లో సంఖ్య పెంచటం కోసం, బలవంతంచేసి బళ్ళో చేర్చుకున్నాడు. చదువు రుచి చూపించాడు.

టెంత్ పాసయ్యేసరికి సుబ్బడు కాస్తా సుబ్బారావుగా మారేడు. వేషం, భాష మారిపోయాయి. డిగ్రీ

చేతికొచ్చేసరికి ఆలోచనా విధానమే మారిపోయింది. యూనివర్సిటీలో యింకా పైచదువులు చదువుతానని కొడుకు అన్నప్పుడు ఆదెయ్య ఆశ్చర్యపోయాడు.

యింతింత చదువులు వూరికే తన కొడుక్కి వాళ్ళెవరో ఎందుకు చెప్పిస్తున్నట్లు?

కొడుకు యూనివర్శిటికి వెళ్ళిన కొన్నాళ్ళకు అసలు కథ మొదలయింది. సుబ్బారావు తండ్రికి డబ్బు పంపమంటూ వుత్తరాల మీద వుత్తరాలు రాసేవాడు.

'మీకు చదువంతా ఉచితంగా చెప్తార్రా! కాదు. కాదు మీకు అన్నం పెట్టి, సాదర ఖర్చులకు డబ్బులిచ్చి మరీ చెప్తారు. నీ కొడుకు రాస్తున్న విషయాలన్నీ అబద్ధాలు...' కొన్నాళ్లు డబ్బు పంపి డబ్బు పంపలేనప్పుడు పదిమందినీ విచారిస్తే అంతా చెప్పిన మాట అది.

వారం రోజుల క్రితం సుబ్బారావు డబ్బు పంపమని మళ్ళీ రాసేడు.

కానీ యీసారి ఆదెయ్య డబ్బు పంపలేదు. యిక పంపకూడదని నిర్ణయించుకొన్నాడు. కాగా పంపాలన్నా డబ్బెక్కడ వుంది? హాలు వాళ్ళిచ్చిన జీతం ఎప్పుడో అయిపోయింది. జాలమ్మ పనిచేసే ఇంటి వాళ్లు మరో నెలదాకా రారు. చావకుండా తినటమే కాని కమ్మగా కడుపునిండా తిండి తినటానిక్కూడా శక్తి లేదే?

అలా వుండగా ఆ మధ్యాహ్నం సుబ్బారావు నుంచి మళ్ళీ వుత్తరం వచ్చింది. డబ్బు వెంటనే పంపకపోతే తను ఆకలితో చావాల్సి వుంటుందని, చదువు మానేసి తిరిగి రావల్సి ఉంటుందని బెదిరించాడందులో.

ఆదెయ్య మెత్తబడ్డాడు. సినిమాహాలు ప్రొప్రయిటర్‌ని అడిగి అప్పు తీసుకొనైనా పంపాలని నిర్ణయించుకొన్నాడు.

ఆదెయ్య చెప్పిందంతా విన్నాడు ప్రొప్రయిటర్. చూపించిన వుత్తరాలన్నీ చదివేడు. ఆఖరికి నవ్వేడు.

'నీ కొడుకు చదువుతున్న వూరి నుంచి నేనీవాళే వచ్చానురా ఆదిగా. వాడు నీకు భలే టోపీ వేస్తున్నాడులే. అక్కడ యూనివర్శిటీలో నీ కొడుకు వో హీరో. గొప్ప విలాస పురుషుడని చెప్పుకొంటున్నారులే. ఒరేయ్ ఆదీ. మీ పిల్లలకి అన్ని సౌకర్యాలు కల్పించి చదువు చెప్పిస్తున్నది జీవితంలో భ్రష్టుపడమని కాదురా. పైకి వస్తారన్న ఆశతో. నువ్వొకసారి వెళ్ళి నీ కొడుక్కి నచ్చచెప్పి వాడిని మంచిమార్గంలో పెట్టుకో. లేకపోతే వాడు చెడతాడు. తోటి వాళ్ళను చెడుస్తాడు. మొత్తం సంఘాన్నే చెడగొడ్తాడు'' అంటూ ఆయన చాలా చాలా విషయాలు వివరంగా చెప్పేడు. దాంతో ఆదెయ్య బుర్రలో ఆలోచనలు కందిరీగతుట్టెల్లా కదిలాయి.

ఇన్ని సలహాలు చెప్పిన సినిమా హాలు యజమాని, కొడుకు దగ్గరికి వెళ్ళటానికి డబ్బడిగేసరికి లేదన్నాడు. దాంతో హాలు యజమాని, కొడుకుని గురించి చెప్పినదాన్ని నమ్మబుద్ధికాలేదు ఆదెయ్యకు. అలాగని ఇందరు చెప్పినదాన్ని కొట్టివేయనూ లేకపోతున్నాడు.

"నా సలహాను అడిగితే ఆదిగా - మీ సుబ్బడి సదువు మానిపించెయ్యటం మంచిది. ప్రొప్రయిటరేకాదు, మన వూరి కాలేజీ మాస్టారు ఒకాయన కూడా మొన్నామధ్య పేపర్లు దిద్దటానికిపోయి మీవాడుండే

హాస్టల్లోనే బస చేశాట్ట. అప్పుడు చూచాట్ట-మీవాడి రాసక్రీడలు. ఏం వర్ణించి చెప్పేడనుకున్నావు? నీ కొడుకును అంత దూరం పంపింది చదువుకోటానికా సర్దాలు చేసుకోటానికా? సరే పో......మాట్నీ వదిలేరు. సినిమా హాలు త్వరగా చిమ్మేయి.''

సినిమాహాల్లో చెత్తను చిమ్ముతూ, ఎలాగయినాసరే కొడుకు చుట్టూ చేరిన చెత్తను తుడిచేయాలనుకొన్నాడు ఆదెయ్య.

కానీ అందుకు డబ్బు అవసరం.

డబ్బు సంపాదించటానికి అనేక మార్గాలుండవచ్చు. కానీ తనకు తెల్సింది కొన్ని మాత్రమే. అందులో ఒకటి.....

★ ★ ★

ఫస్ట్ షో ఇంటర్వల్‌లో ఆమెను పరిశీలించి ఆదెయ్య వేసిన అంచనా తప్పుకాలేదు.

అతను సులభంగానే ఆమె యింట్లోకి ప్రవేశించగలిగేడు.

సినిమా నుంచి వచ్చిన ఆమె బట్టల్ని కూడా సరిగా మార్చుకోలేదు. విప్పిన చీరె హాంగర్‌కు అలాగే వేలాడుతోంది. కాటన్ చీరె తీసుకోటానికి బీరువా తలుపులు తెర్చినట్లుంది. కానీ ఆ తాళం చెవుల్ని జాగ్రత్త చేసే వోపిక లేక పోయింది.

సినిమాహాళ్లో ఆమె శరీరం మీద మెరిసిన ఆభరణాలు యిప్పుడు బీరువాలో తళతళ మెరుస్తున్నాయి. లాకర్‌లో పెట్టే జాగ్రత్త కూడా లేదా మహారాణికి?

పట్టుచీరెలు.......వజ్రాల నగలు....యివి దేనికి తనకి?

తనకి కావల్సింది.....డబ్బు.

ఆదెయ్య తాళం తీసేడు.

కష్టపడి లాకర్ తెరిచాడు. పాస్ బుక్కులు.......చెక్కుబుక్కులు.... డబ్బు పెద్దగా లేదు. చిల్లర నోట్లే.......

పైసా మిగల్చకుండా డబ్బు తీసుకొన్నాడు. నగలు మూటగట్టేడు.

పాపం-సినిమా చూచి ఎంత అలసిపోయారో? యింటివాళ్ళు ఆదమరచి నిద్రపోతున్నారు. పైగా వాకిట్లో వర్షం చప్పుడు....

ఏం శబ్దాలు చేసినా విన్పించదు.

అతను తను దొంగతనం చేసిన జాడలేం లేకుండా తగు శ్రద్ధలు తీసుకొన్నాడు. వచ్చిన దోవనే వెళ్ళబోతుండగా అతనికి ఆకలి గుర్తుకొచ్చింది.

వంట యింట్లోకి వెళ్ళేడు. ఏ హోటల్లో భోం చేసేరో ఏమో.....వండిన అన్నం, పదార్థాలు, వండినట్లే

వున్నాయి. అతనికి నోరూరింది. అక్కడికక్కడే టేబిల్ మీద కూర్చొని అన్నీ వడ్డించుకొని భోజనం చెయ్యాలనిపించింది.

యింతలో జాలి గుర్తుకొచ్చింది. తనలాగా అదీ ఆకలితో నకనకలాడుతోంది-పాపం!

అతను నడుంకు చుట్టుకొన్న ఎర్రటి వుత్తరీయాన్ని విప్పేడు. దాన్ని పర్చి అందులో అన్నం, పప్పు, కూర, పచ్చళ్లు అన్నీ వేసేడు. నేతి టిఫిన్ కన్పించింది పక్కనే. అందులో నెయ్యితీసి యింత ముద్ద అన్నంలో వేసి మూటకట్టేడు. ఖాళీ అయిన పాత్రల్ని సింక్‌లో వేసి పంపుతిప్పేడు.

పంపుకట్టేసి వంటింటి తలుపు తెర్చుకుని దొడ్డివాకిలి గుండా చీకట్లో కల్సిపోయాడు.

★ ★ ★

ఫోను...

వొకసారి.......రెండోసారి.....మూడు...నాలుగుసార్లు.

యస్పీ శ్రీనివాసులు ధనవంతుల ఇళ్లలో దొంగతనాలు జరిగితే వెంటనే దొంగను పట్టేసి సొమ్ము అప్పచెప్పేస్తాడు.

శ్రీనివాసులు పోలీస్ డిపార్టుమెంట్‌లో తప్పబుట్టేడు.

దొంగతనం జరిగిందనగానే పోలీసువాడు అడిగే సాధారణ ప్రశ్న-'ఎంత పోయిందని'. కానీ శ్రీనివాసులు 'ఎవరింట్లో జరిగింది?' అని ప్రశ్నిస్తాడు.

ఇప్పుడు దొంగతనం జరిగింది ధనవంతుల ఇంట్లో. ధనవంతులేకాక వీళ్ళు పలుకుబడి కూడా బాగా వున్న వాళ్ళులాగే కన్పిస్తోంది. కనుక ఎలాగూ వాళ్ళకు నష్టం వుండదు. యివాళ కాకపోతే రేపైనా, దొంగను పట్టినా పట్టలేకపోయినా పోలీసు డిపార్టుమెంట్, వాళ్ళ సొమ్ము వాళ్ళకు ఏదో రూపంలో ముట్టచెప్పక తప్పదు.

అయిదోసారి ఫోన్ వచ్చాకయినా శ్రీనివాసులు లేచి నిలబడక తప్పలేదు. యస్పీగారి నుంచి ఆ ఫోను....

★ ★ ★

శ్రీనివాసులు స్టాఫ్‌ను వెంటబెట్టుకొని దొంగతనం జరిగిన యింటి కెళ్ళేడు. వర్షం రాత్రి. పైగా తలుపు గొళ్లేలు సరిగా వెయ్యకపోవటం వల్ల దొంగ కిటికీలో నుంచి అడ్డ గడియ తీసి, హాయిగా రాజమార్గం గుండా లోపలికి ప్రవేశించి దొంగతనం చేసేడు. ఏ ఆధారం పోలీసులకు మిగిల్చిపోలేదు దొంగ.

ఇంటి యజమానుల్ని ప్రశ్నలు వేసేడు. "బీరువాలో నగలు, చీరెలు పోయాయి' అదే వారి మాట. కానీ ప్రతి దొంగ ఏదో క్లూ మిగిలించి పోతాడన్నది పోలీసుల ఇన్‌వెస్టిగేషన్‌లో మొదటి సూత్రం.

దొంగను ఎలాగయినా పట్టుకుతీరాలి. సొమ్ము రికవర్ చేసి తీరాలి. లేకపోతే మరో చోట తస్కరింపబడిన సొమ్మునయినా ఇవ్వవల్సి వుంటుంది . అలా కొన్ని మధ్య తరగతి కుటుంబాలు నష్టపోవచ్చు.

శ్రీనివాసులు గదినంతా పరిశీలించాడు పట్టుదలగా . తలుపుకు ఓ ఎర్ర రంగు పోగుఇరుక్కుని కన్పించింది. దాన్ని. జాగ్రత్తగా పరిశీలించాడు. ఖరీదైన దారం పోగుకాదది .అంటే ఆ ఇంట్లో వాళ్ళ చుట్టాలకు సంబంధించినదికాదు . పని మనుష్యుల్ని పిలిచిప్రశ్నలడిగేడు. వాళ్ళు కూడా ఇలాంటి బట్టలు వేసుకోరు. మరి ఎక్కడినుంచి వచ్చిందా దారప్పోగు.

ఆలోచిస్తుండగా అలోచిస్తుండగా హఠాత్తుగా బుర్రలో వో మెరుపు మెరిసింది.

“వంట ఇంట్లో ఏమీ పోలేదా?”

ఆ ప్రశ్న విని వులిక్కిపడ్డారు ఇంటివాళ్ళు. వాళ్ళ సమాధానం విన్నాక శ్రీనివాసులకు క్లూ దొరికింది.

దొంగతనం జరిపే వో తెగలో వాళ్ళను గురించి విచారణ చేసేడు. వాళ్ళు దొంగతనం ఏమి చేసినా అన్నం కన్పిస్తే మాత్రం తీసుకుపోకుండా వుండలేరు. అది ఆ తెగవారి దొంగతన లక్షణం...

పరిశీలన చేస్తే ఆ తెగలో దొంగతనాలు చేసే వారంతా జైళ్ళల్లోనే వున్నారు. మరి వీడెవడు?

ఎర్రబట్టలు కట్టే వారి వివరాలు విచారిస్తే ఆఖరికి ఆదెయ్య తేలేడు. ఆదెయ్యకు దొంగతనం వృత్తికాదు. కానీ ఆ విద్యలో ప్రవేశంవున్నవాడు. ఏం అవసరమొచ్చిందో పాపం?

దొంగ వస్తువులు కొనే బడాబడా శేఠ్‌లను విచారించాడు. అమ్మకానికి నగలు రాలేదు. అంటే దొంగకు ఆ వూళ్ళో ఖాతాదారులు లేరన్నమాట.

మొదట్లో అబద్ధం చెప్పటానికి ప్రయత్నించినా జాలమ్మ చివరికి అన్నీ చెప్పక తప్ప లేదు.

“నీ కొడుకు విషయంలో నేను సహాయం చేస్తాను. కానీ నీ మొగుడు నగలెక్కడ కుదవబెట్టేడు చెప్పు.”

“సెత్తెప్పెమాణం చేసి సెప్తున్నా బాబయ్యా. నాకు తెల్దు. వణ్ణంమూట యిప్పి ఆడంత తిని నాకింత పెట్టి అదే పనిగా లగెత్తుకుంటూ ఎల్లిపోయాడు.”

జాలమ్మ మాటల్ని అనుమానించలేదు శ్రీనివాసులు.

కొంపతీసి ఆదెయ్య ఆ సొమ్మును సిటీలో అమ్మలేదు కదా అనుకుంటూ హడావుడిగా సిటీకి ప్రయాణమయ్యాడు యస్సై.

★ ★ ★

ఆదెయ్య రైలు దిగి, వాళ్ళను, వీళ్ళను వాకబు చేసుకొంటూ కొడుకుండే హాస్టల్ దగ్గరికి చేరుకొనే సరికి చీకటి పడింది.

దొంగసొమ్ము బొడ్డు వద్ద శరీరాన్ని స్పృశిస్తూ అతడు చేసిన నేరాన్ని అనుక్షణం గుర్తు చేస్తూనే వుంది. వాటిని అమ్మేయాలి. కానీ అంతకుముందు కొడుకు విషయం తేల్చుకోవాలి. అందరూ అంటున్నట్లు వాడు మోసగాడు, రౌడీనా? లేక నిజంగా వాడికి డబ్బవసరమా?

లైట్లతో, ఈలలతో, అరుపులతో, ట్రాన్సిస్టర్ల నుంచి వచ్చే మ్యూజిక్‌తో కోలాహలంగా వున్న ఎత్తయిన ఆ భవనం లోపలికి ప్రవేశించి దిక్కులు చూస్తూ నిలబడి పోయాడు. రూములన్నీ వొకేలాగా వున్నాయి. ఇంగ్లీషు "O" ఆకారంలో వున్న భవనం అది.

"బాబయ్యా, సుబ్బుడు వుండేదేడ?"

ఆ కుర్రాడు ఆగి చిత్రంగా చూచేడు ఆదెయ్య వైపు.

"సుబ్బడా? వాడెవడు? హాస్టల్‌లో పనివాడా?"

"కాదు బాబూ. టూడెంట్. ఇదిగో..." అంటూ సుబ్బుడు రాసిచ్చిన కాగితం ఆ విద్యార్థికి చూపించాడు ఆదెయ్య.

"ఓ! మిస్టర్ సుబ్బారావ్! అతడు మీకిప్పుడెక్కడ దొరుకుతాడు? దొరికినా మాట్లాడతాడా? అసాధ్యం. యింతకీ మీరెవరు? అతడితో ఏం పని?"

అవును.........తానెవరు? ఏం పని?

ఎలా చెప్పటం? ఏమని చెప్పటం?

వాడు నా కొడుకు - నేను వాడి తండ్రిని అని చెప్పుకుంటే అసలు విషయం తెలీదు. కొడుకు అసలు రంగు తెల్సుకోవాలంటే తానెవరో ఎవరికీ చెప్పకూడదు?

"మా ఊరే బాబయ్య. సూసి పోదామని వచ్చినా. అంతే."

కొడుకు గదికి అల్లంత దూరంలో చీకట్లో నిలబడి ఎదురుచూసి విసుగేసింది ఆదెయ్యకు. ఆ గది దగ్గర నాలుగురాళ్ళు గుర్తుగా పేర్చుకొని గదుల్లో వున్న స్టూడెంట్సు ఏం చేస్తున్నారో చూద్దామని బయలుదేరాడు.

కొన్ని గదుల్లో పేకాటలాడుతున్నారు. మరి కొన్నింటిలో కొంతమంది కుర్రాళ్ళు చేరి సినిమాలు, ఏక్టర్లను గురించి చర్చలు చేసుకొంటున్నారు. కొద్దిమంది కుర్రాళ్ళు మాత్రం ఒంటరిగా గదుల్లో కూర్చొని చదువుకొంటున్నారు ఏకాగ్రతతో.

వాళ్ళను చూస్తే ముచ్చటేసింది ఆదెయ్యకు. సుబ్బుడు ఇలా చదువుకొంటుంటే చూడాలనిపించింది. కానీ ఇంతమంది కుర్రాళ్ళలో బుద్ధిగా చదువుకొంటున్నవాళ్ళు కొద్ది  మంది మాత్రమే వున్నారేం? మిగతావాళ్ళంతా అలా బేకారుగా వున్నారేం?

"ఏరా ఆదెయ్యా ఎప్పుడొచ్చావ్?"

ఆ గొంతు.....ఆ గొంతు....ఆ గొంతు విని వులిక్కిపడ్డాడు ఆదెయ్య. గుండె దడదడలాడింది.

చేతులకు సంకెళ్ళు........పోలీసుల దెబ్బలు......జైలు కటకటాలు కళ్ళముందు కదలాడేయి.

"ఏరా? గుర్తుపట్టలేదా? పోలీస్‌డ్రెస్‌లో లేనుకదూ? యస్సైనిరా నేను. మావాడొకడు ఈ హాస్టల్లో వున్నాడులే. చూచి పోదామని వచ్చాను. అన్నట్లు మీవాడు కూడా చదువుతున్నాడు కదూ? ఈ హాస్టల్లోనేనా వుంటున్నాడు?'' శ్రీనివాసులు ఆదెయ్య భుజం మీద చెయ్యివేసి ఆప్యాయంగా అన్నాడు.

"అవును బాబయ్యా, సుబ్బడిని సూద్దామనే వచ్చాను. ఆడు నేను వచ్చేసరికి గదిలోలేడు. ఆడికోసమే ఎదురుసూత్తన్నా...''

"అరె పాపం! అట్టాగా? పొద్దుట్నుంచీ యిక్కడే పడున్నావా?''

"నేదయ్యా, నేనొచ్చే పాలికే పొద్దుగుంకింది గదా?''

అయితే వీడు పగలంతా ఏం చేసినట్లు? కొంపతీసి నగలు అమ్మేస్తూ కూర్చే లేదు కదా?''

మరి రెండు ప్రశ్నలేసి ఆ సందేహాన్ని నివృత్తి చేసుకొన్నాడు శ్రీనివాసులు. వొక బండెక్కబోయి మరో బండెక్కటం వల్ల ఈవూరు చేరటం ఆలస్యమయింది.

"సరే అయితే నేను వెళ్ళొస్తారా? నేనూ ఇప్పుడే జీపులో వస్తున్నా. మావాడు వున్నాడో, లేడో చూడాలి' ' అంటూ శ్రీనివాసులు రెండడుగులు వేసి ఏదో తగులుకొన్నట్లు క్రింద పడ్డాడు.

"అదేంటి బాబయ్యా అట్టాపడ్డావు? అయ్యయ్యో లేవండి'' అంటూ ఆదెయ్య శ్రీనివాసుల్ని లేపటానికి ముందుకొచ్చాడు.

లేస్తూ అతని నడుంపట్టుకొని తడిమి, దొంగిలించిన సొమ్ము అతని వద్దనే వుందని రూఢి చేసుకొన్నాడు శ్రీనివాసులు.

"వస్తారా. మావాడితో అర్జంటుగా మాట్లాడే పనుంది'' అంటూ శ్రీనివాసులు వెళ్ళిపోయాడు.

ఆదెయ్య జైలులో నుంచి తప్పించుకొన్న వాడిలా హాయిగా వూపిరి పీల్చుకొన్నాడు!

★ ★ ★

పొద్దుపోయింది. హాస్టల్‌లో దీపాలు వొక్కొక్క గదిలో క్రమంగా ఆరిపోతున్నాయి. సద్దుమణిగిపోతోంది.

హాస్టల్ గేటులో నుంచి లోపలికి వచ్చే ప్రతి వ్యక్తినీ గమనిస్తున్నాడు ఆదెయ్య. కానీ తనను వో వ్యక్తి రహస్యంగా గమనిస్తున్నాడన్న స్ఫురణ మాత్రం లేదతనికి.

శ్రీనివాసులు వెళ్ళిపోగానే అతనికి పోలీసుల భయం పోయి ధైర్యం వచ్చింది. దొంగతనం విషయం పోలీసులకి తెల్సే వుంటుంది. కానీ తన మీదకి అనుమానం రాలేదు. అంటే తను భయపడనక్కర్లేదు.

గేటు వద్ద ఆటో ఆగింది. ముగ్గురు వ్యక్తులు-యిద్దరు మగ, వొక ఆడ-లోపలికి ప్రవేశించారు.

చదువుకొనే పిల్లల గదిలోకి ఆడవాళ్ళు కూడానా?

ముందువొక మగ మనిషి, వాళ్ళకి కొద్ది దూరంలో మరో మగ-ఆడ-

చకచకా నడిచి వస్తున్నారు వాళ్ళు.

ఏ గదిలో పిల్లల పనో అది. సుబ్బడు మాత్రం అలాంటి వాడు కాదు.

కానీ చిత్రం! సుబ్బడి గది తలుపు తెర్చుకొంది. లోపల లైటు వెలిగింది. ఆ పిదప తలుపులు మూతపడ్డాయి.

ఆదెయ్య ముందు స్తబ్ధుడయ్యాడు. ఆ తర్వాత కోపం వచ్చింది. ఏడుపు కూడా వచ్చింది. తర్వాత ఆలోచించసాగాడు.

తనేం చేయాలిప్పుడు? తలుపు తట్టి సుబ్బారావును పిలవటమా? మానటమా? అసలు వాళ్లెవరో? లోపల ఏం చేస్తున్నారో? అందులో అసలు సుబ్బడు వుండకపోవచ్చు కదా? వాడి గదిలో మరెవరో....

ఆదెయ్య పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ గది వద్దకెళ్ళేడు. తలుపు సందులో నుంచి సన్నటి వెలుగురేఖ!

ఆ తలుపు బాదకుండా లోపలికి చూశాడు ఆదెయ్య.

ఎదురుగ్గా మంచం మీద సుబ్బడు....

వాడి వొళ్ళోకి జారపడి వయ్యారాలు వొలకబోస్తూ వో అమ్మాయి. ఫేను గాలికి కదులుతున్న ఆమె ముంగురులను సవరిస్తున్నాడు సుబ్బడు.

చేతిలోని గ్లాసులో ద్రవాన్ని తను వో గుక్కతాగి, ఆమె చేత వో గుక్క తాగిస్తున్నాడు. ఆమె చేతిలో ఎర్రగా కాలుతున్న తెల్లటి సిగరెట్టు. తనో పీల్చుపీల్చి అతడి పెదిమలకు అందిస్తోంది.

అయితే అందరూ అనుకొంటున్నది నిజమేనన్నమాట!

చదువు పేరుతోవచ్చి సుబ్బడు యిక్కడ తన డబ్బుతో, గవర్నమెంటు డబ్బుతో నేర్చుకొంటున్న విద్య యిదన్నమాట! ఛీ.....ఛీఛీ.

ఆదెయ్య రక్తం సలసలా కాగింది. బడబానలం పొంగింది.

వీడి కోసమా తాను దొంగతనం కూడా చేసింది?

ఆదెయ్య ప్రళయకాల రుద్రుడయ్యాడు. వీడి సంగతి తేల్చుకోవాల్సిందే.

తలుపులు బదబదా బాదేడు.

"హూ దట్ బ్లడీ బాస్టర్ యీజ్?"

తలుపు తెర్చుకొంది.

"ఎవడ్రా నువ్వు? కంట్రిబ్యూట్ లాగున్నావే? తలుపు అలా బాదుతావేం? ఎవరు కావాలి?"

"సుబ్బడు....అదే మీ సుబ్బారావు......"

"సుబ్బారావు దర్శనానికి యిదా సమయం? ఛట్....బుద్ధిలేని నాకొడకా. వెళ్ళెళ్లు.... పో.. రేపురా'

"రేపా! అలా వీల్లేదు. యిప్పుడే....యీ నిముషంలో.....నేనెవడిననుకొన్నావ్?"

"కామ్రేడ్? ఎవడ్రావాడు? విరోధులా? సఫా చేసెయ్...."

సుబ్బారావు వో చేత్తో గ్లాసుపట్టుకొని తలుపుదగ్గరికొచ్చాడు. తండ్రిని చూచాడు. తండ్రి కొడుకును చూచాడు. పులి ఎలుక పిల్లను చూచినట్లు-

"నీ కోసమేనట బాస్......"

వొకటి........రెండు. .....పది......ఇరవై క్షణాలు-

'క్యాహోగయా బాస్? హూయీజ్ దట్ మేన్?' స్నేహితుడి ప్రశ్న.

"ఏంలేదు....ఏంలేదు.....నథింగ్ హేపెన్డ్. మావూరే యీయనది. హియీజ్ అవర్ సర్వెంట్ మాట్లాడి వస్తాను గాని నువ్వు లోపలికెళ్ళు. సరుకు జాగ్రత్త. ఏం?" ఇంగ్లీషు తెలుగు కలిపి చెప్పేడు సుబ్బారావు.

తలుపు మూసుకొంది మళ్ళీ.

'ఏంటిది అయ్యా? డబ్బు పంపించమని రాస్తే చడీచప్పుడూ లేకుండా నువ్వే వచ్చావ్? మా గదిలో ఫ్రెండ్స్ వున్నారులే. పైగా ఉక్కగా వుంటుంది. నీకు గాలి కావాలి కదా? యిక్కడ పడుకో. గాలి బాగా వస్తుంది. సంచీ అయినా తెచ్చినట్టు లేదే! డబ్బన్నా తెచ్చావా? యిటివ్వు. లోపల జాగ్రత్త చేస్తాను.'

'థూ......ఎదవ నా కొడకా. నా కడుపున సెడబుట్టేవు గదరా.......' అంటూ కొడుకు జుట్టు పట్టుకొని వంచి దబదబా బాదసాగాడు ఆదెయ్య.

సుబ్బారావు కిక్కురుమనలేదు. అతడి బాధ తండ్రి కొట్టినందుకు కాదు. తనని కొట్టడం యితరులెవరైనా చూస్తారేమోనని?

హఠాత్తుగా వో వ్యక్తి ఆదెయ్య చెయ్యిపట్టుకున్నాడు. అతడి నుంచి సుబ్బారావును విడిపించాడు.

"సుబ్బారావ్. డిగ్రీలు, పేరుకు తగిలించుకున్నంత మాత్రాన మనిషి విద్యావంతుడయినట్లు కాదు. తెల్లగుడ్డలు వేసుకొని తైతక్కలాడినంత మాత్రాన నాగరికుడనిపించుకోడు. పేరు ఫేషనబుల్‌గా మార్చుకున్నంత మాత్రాన సంస్కారం పెరగదు. నినాదాలు చేసి, అరాచకాలు సృష్టించినంత మాత్రాన విప్లవాలు రావు. నీ సంగతంతా నాకు తెల్సు. కానీ నీకే నీ అయ్య సంగతి తెలీదు. నీ కోసం అతను చేసిన త్యాగాన్ని తెల్సుకొన్న నాడైనా నీ నడకను మార్చుకొంటే నీకు నువ్వు, నీ కుటుంబానికి, సంఘానికి, విద్యార్థిలోకానికి సేవచేసిన వాడివవుతావు. పద ఆదెయ్యా?"

శ్రీనివాసుల్ని చూచి భోరుమన్నాడు ఆదెయ్య.

"ఇన్స్పెక్టర్టు బాబూ. నేను సదువు లేనోడిని. కాయకట్టంసేసి బతికేవోడిని. కట్టాన్ని మర్సిపోటానికి ఎప్పుడన్నా కల్లు తాగొచ్చు. కానీ తాగుబోతు ఎదవను మాత్రం కాదు. పొట్ట కూటి కోసం ఎప్పుడయినా దొంగతనం సేత్తే సేసివుండొచ్చు. కానీ దొంగతనం నా వృత్తి కాదు. నేను ఎబిశారిని కాను. నా కొడుకు

ఇవేవీ కాకూడదని, సదువుకొని గొప్ప మనిసి అవుతాడని ఆశపడ్డాను. కానీ ఈ ఎదవను సదువు సెడగొట్టిందయ్యా. ఆళ్ళెవరో అప్పనంగా అన్నంపెట్టి, వుండటానికి మంచి గదులిచ్చి, ఎదురు డబ్బిచ్చి సదువు సెప్పిత్తున్నారు కదా? యాడికి కళ్ళు నెత్తిమీదికొచ్చాయి. తాగటం, ఎబిశారం, సదువను కొంటు న్నాడు. ఆయ్యను బట్టుకొని అంట్లుతోమే సేవకుడంటున్నాడు. యీడో పెద్ద దగుల్బాజీవోడు, దొంగ. సదువుకోవాల్సిన సోట ఎబిశారం సేత్తన్నాడు. సదువు సెప్పే వోళ్ళ కళ్ళుకప్పిన యీడికి మించిన దొంగ లేడు. అన్నం పెట్టేవోడి ఇంటికి కన్నం వేసే దొంగనాకొడుకు యీడే...యీడే. యీడిని బొక్కలో తోయండి. లేకపోతే యీడివల్ల సదువుకి, మనుస్సులకి, మంచిపనులకి యిలువ లేకుండాపోతుంది."

ఆదెయ్య ఆవేశంగా అరిచాడు. ఆ అరుపులకి గదుల్లో లైట్లు వెలిగేయి, తలుపులు తెర్చుకోసాగేయి.

"సరేగానీ కాస్త శాంతించు ఆదెయ్యా. నీ కొడుకు మారిపోతాడులే. మంచివాడవుతాడులే. రచ్చచేయకు ఇక్కడ. పద వెళ్దాం. నా జీపులో తీసుకెళ్ళి మీ ఇంట్లో వదుల్తాను."

"వత్తాను బాబూ. కానీ ఇన్‌స్పెక్టరు బాబూ, నన్ను తీసుకెళ్ళాల్సింది మా ఇంటిక్కాదు. పోలీస్ టేసన్‌కు, జైలుకు. ఈ దొంగనాకొడుకు కోసం రేత్తిరి దొంగతనం కూడా చేసేను. ఇదిగో బాబూ సొమ్ము. దొంగతనం సేసిన అన్నం తిన్నాం. కానీ సొమ్ము బద్దరంగానే వుంది."

శ్రీనివాసులు ఆదెయ్య అందించిన నగలు అందుకొన్నాడు. అతని భుజం మీద చేయివేసి దగ్గరికి తీసుకొన్నాడు.

"దొంగతనం నేరమే ఆదెయ్యా. శిక్ష కూడా తప్పదు. కానీ నువ్వు చేసిన దొంగతనం వొక వ్యక్తిని మంచిగా మార్చగలిగితే నీకు శిక్ష కూడా వరమే అవుతుంది. మనిషి నేరాలు చేయటం సహజం ఆదెయ్యా. కానీ తన నేరాన్ని తప్పుగా గుర్తించి, తనని తాను సంస్కరించుకొనే శక్తి ఉన్నతులకే వుంటుంది. నువ్వు అలాంటి ఉన్నత సంస్కారం వున్న వ్యక్తివి. నిన్ను నేరస్థుడిగా నేను భావించను. పద వెళ్దాం."

శ్రీనివాసులు ఆదెయ్య భుజం మీద చెయ్యివేసి సుబ్బారావు వైపు చూశాడు. సుబ్బారావు తలవంచుకొన్నాడు.

ఆదెయ్య భుజం మీద చెయ్యి వేసి నడిపిస్తూ శ్రీనివాసులు హాస్టల్ గేటు దాటబోతున్నాడు-

"అయ్యా......"

ఆ పిలుపు విని ఆశగా వెనక్కి తిరిగి చూశాడు ఆదెయ్య! బడ బానలం చల్లబడింది.

పల్లకి వార పత్రిక - 28.11.1985